నమస్తే తెలంగాణ
జగిత్యాల
5 | కరీంనగర్, శుక్రవారం 16 ఆగస్టు 2024 | JAGTIAL

## హామీలు అమలు చేస్తున్నాం

మేం అధికారంలోకి వచ్చిన రెండు రోజుల నుంచే అభయ హస్తం హామీల్లో ఒక్కొక్కటీ అమలు చేస్తున్నాం. సంక్షేమంలో మహిళలకు పెద్ద పీట వేస్తున్నాం. ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాం. రాజీవ్ ఆరోగ్య శ్రీ వైద్య పరిమితిని పెంచాం. మహాలక్ష్మి పథకం కింద ₹500లకే వంట గ్యాస్ ఇస్తున్నాం. గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్లలోపు వినియోగదారులకు ఉచిత సరఫరా చేస్తున్నాం. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేశాం.

**-కరీంనగర్‌లో మంత్రి శ్రీధర్ బాబు**



కరీంనగర్ పరేడ్ గ్రౌండ్‌లో జెండా వందనం చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, కలెక్టర్ పమేలా సత్పతి, సీపీ అభిషేక్ మహంతి, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం,తదితరులు



కరీంనగర్‌లో తీగలగుట్టపల్లిలోని కేసీఆర్ భవన్‌లో జెండా వందనం చేస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీరామకృష్ణారావు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు



కోరుట్ల : ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసు ఆవరణలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల జెండా వందనం

# పంద్రాగస్టు పండుగ

**ఉమ్మడి జిల్లాలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవం**



**పంద్రాగస్టు వేడుకలు ఉమ్మడి జిల్లాలో కనుల పండువలా జరిగాయి. గురువారం ఊరూవాడా పతాకావిష్కరణ చేయడంతో ఎటుచూసినా మువ్వన్నెల జెండాలు రెపరెపలాడాయి. ముఖ్యంగా జిల్లాకేంద్రాల్లో సంబురాలు అంబరాన్నంటాయి. ఆయాచోట్ల పతాక ఆవిష్కరణల అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.**

- ఊరూరా మువ్వన్నెల జెండా రెపరెపలు
- జిల్లాకేంద్రాల్లో అంబరాన్నంటిన సంబురాలు
- జాతీయ జెండాలను ఆవిష్కరించిన ప్రముఖులు
- అలరించిన విద్యార్థుల ప్రదర్శనలు
- ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు

**-జగిత్యాల ఆగస్టు 15(నమస్తే తెలంగాణ)/ కలెక్టరేట్**

స్వాతంత్ర్య దినోత్సవ సంబురాలు ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా అంబరాన్నంటాయి. ఊరూరా.. వాడవాడనా త్రివర్ణ పతాకాలు ఎగిరాయి. అన్ని ప్రభుత్వ ఆఫీసులు, వివిధ పార్టీలు, సంఘాల కార్యాలయాలు, విద్యాలయాలు, వ్యాపార కేంద్రాల్లో బాధ్యులు జాతీయ జెండాలను ఆవిష్కరించారు. ప్రధానంగా జిల్లాకేంద్రాల్లో అధికారిక వేడుకలను కనులపండువలా నిర్వహించారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని పరేడ్ గ్రౌండ్‌లో రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జగిత్యాల జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో విప్ ఆది శ్రీనివాస్, పెద్దపల్లి జిల్లా సమీకృత కలెక్టరేట్ ప్రాంగణంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ల శారద పాల్గొని, జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయాచోట్ల పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించి, స్వాతంత్ర్య సమరయోధులను సన్మానించారు. ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. వివిధ వేషధారణలతో.. త్రివర్ణ పతాకాలతో భారతమాతను, స్వాతంత్ర్య సమరయోధులను కీర్తిస్తూ చిన్నారులు నృత్యాలు చేస్తూ, నాటికలు ప్రదర్శిస్తూ అకట్టుకున్నారు.



జగిత్యాలలో జెండాకు వందనం చేస్తున్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్

## సంక్షేమానికి ప్రాధాన్యం

రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నది. ఇంకా ప్రజల సమస్యల పరిష్కారంలో ముందున్నది. ప్రజారోగ్యానికి పెద్ద పీట వేసింది అందులో భాగంగానే రాజీవ్ ఆరోగ్య శ్రీ వైద్య సహాయ పరిమితిని పెంచింది. మరిన్ని వ్యాధులను చేర్చి మొత్తం 1675 రకాల జబ్బులకు చికిత్సలకు అందిస్తున్నది.

**- జగిత్యాలలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్**

## మాది ప్రజాప్రభుత్వం

మాది ప్రజాప్రభుత్వం. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో సబ్బండవర్గాలకు అండగా నిలుస్తున్నాం. దేశంలో ఎన్నడూ జరుగని రీతిలో ఇచ్చిన హామీ మేరకు అమలు చేసి రైతుల కండ్లలో ఆనందాన్ని నింపాం. రైతు కూలీలకు ఏడాదికి ₹12వేల ఆర్థిక సాయం అందించే పథకానికి త్వరలోనే శ్రీకారం చుట్టబోతున్నాం. ప్రకృతి వైపరీత్యాల టైంలో రైతులు నష్టపోకుండా పంటల బీమా పథకాన్ని పునరుద్ధరిస్తాం.

**- సిరిసిల్లలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



సిరిసిల్లలో జెండా వందనం చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్



పెద్దపల్లిలో జెండాకు వందనం చేస్తున్న రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద, కలెక్టర్ కోయ శ్రీహర్ష, తదితరులు

## రైతు సంక్షేమమే మా లక్ష్యం

రైతుల సమగ్ర అభివృద్ధి, సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ రైతులకు ఇచ్చిన మాట ప్రకారం ₹2లక్షల రుణమాఫీ చేస్తున్నది. వానకాలం పంట నుంచి సన్న రకం ధాన్యానికి ₹500 బోనస్ ఇస్తాం. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల మేరకు అభయహస్తం హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నాం.

**- పెద్దపల్లిలో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద**



జగిత్యాలలో విద్యార్థుల ప్రదర్శన



కరీంనగర్ పరేడ్ గ్రౌండ్‌లో విద్యార్థుల ప్రదర్శన





కరీంనగర్ పరేడ్ గ్రౌండ్‌లో పాఠశాల విద్యార్థుల ప్రదర్శనలు






కరీంనగర్ పరేడ్ గ్రౌండ్‌లో విద్యార్థుల ప్రదర్శన



పెద్దపల్లిలో విద్యార్థుల నృత్య ప్రదర్శన




స్వాతంత్ర్య సమరయోధులను సత్కరిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు



సిరిసిల్లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నృత్యం చేస్తున్న విద్యార్థులు



కరీంనగర్‌లో జాగిలం విన్యాసం



కరీంనగర్ పరేడ్ గ్రౌండ్‌లో వేడుకలను తిలకిస్తున్న స్వాతంత్ర్య సమరయోధులు, నగరవాసులు



జగిత్యాలలో జెండాకు వందనం చేస్తున్న ప్రజలు



వేములవాడ రూరల్: మిడ్ మానేరు జలాశయంలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న ముదిరాజ్‌కులస్తులు



కరీంనగర్ గ్రౌండ్‌లో విద్యార్థుల ప్రదర్శనలు



సీఎం చేతుల మీదుగా మెడల్ అందుకుంటున్న శ్రీనివాస్

## శ్రీనివాస్‌కు ఇండియన్ పోలీస్ మెడల్

కరీంనగర్ రాంనగర్, ఆగస్టు 15 : కరీంనగర్ కమిషనరేట్ ఇంటెలిజెన్స్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ ప్రతిష్ఠాత్మకమైన ఇండియన్ పోలీస్ మెడల్‌కు ఎంపికయ్యాడు. గురువారం 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా గోల్కొండ కోటలో సీఎం రేవంత్ చేతుల మీదుగా మెడల్ అందుకున్నాడు. మానకొండూర్‌కు చెందిన ఉండింటి శ్రీనివాస్ ఇప్పటి వరకు సేవా పథకం, 26 క్యాష్ రివార్డులు, 18 జీఎస్‌ఈలు, 1 కమాండేషన్, 9 ప్రశంసా పత్రాలు పొందాడు. ధర్మపురి, కరీంనగర్ 2 టౌన్, అడవి ముత్తారం, పొత్కపల్లి, కరీంనగర్ 1టౌన్, స్పెషల్ బ్రాంచ్ కరీంనగర్, స్పెషల్ బ్రాంచ్ సిరిసిల్ల, గంభీరావుపేటలో పనిచేసిన శ్రీనివాస్ ప్రస్తుతం కరీంనగర్ ఇంటెలిజెన్స్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు.

## హ్యాండ్లూమ్ టెక్నాలజీ కోర్సులో ప్రవేశాలు

కరీంనగర్ కలెక్టరేట్, ఆగస్టు 15 : చేనేత రంగ అభివృద్ధి కోసం ఇటీవల ప్రారంభించిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ కోర్సులో ప్రవేశాలకు ఈ నెల 17 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకుడు ఎస్ చరణ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయంలో మూడేళ్ల డిప్లొమా ఇన్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ కోర్సుకు సంబంధించి రాష్ట్ర విద్యార్థులకు 60 సీట్లు కేటాయించారని వెల్లడించారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు తమ దరఖాస్తులను tsht.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా సమర్పించాలన్నారు. పూర్తి వివరాల కోసం కరీంనగర్ మంకమ్మతోటలోని పొన్నం కాంప్లెక్స్‌లో మొదటి అంతస్థులో ఉన్న తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

## జాతీయ జెండాకు అవమానం

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 15: సిరిసిల్లలోని కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో జాతీయ జెండాను రెండుసార్లు ఎగురవేసి అవమానించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ జాతీయ జెండా ఆవిష్కరణ చేసి, నాయకులంతా గీతాలాపన చేస్తున్న క్రమంలోనే ముడి సరిగ్గా లేదని కొందరు జెండాను కిందికి దించారు. అప్పటికే జాతీయ గీతాలాపన సగం పూర్తి కాగా.. రెండో సారి జెండాను ఎగరవేసి తిరిగి మరోసారి జనగనమణ ఆలపించారు. అయితే రెండు సార్లు జెండా ఎగురవేయడం, రెండుసార్లు జాతీయ గీతాలాపన చేయడంపై దేశభక్తులు మండిపడుతున్నారు.




సిరిసిల్లలోని కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో గీతాలాపన చేస్తున్న సమయంలోనే జెండాను కిందికి దించి ముడి సరి చేస్తున్న నాయకులు